మనిషిలోని ప్రత్యేకతను అభిమానించినట్లే బలహీనతల్ని క్షమిస్తాం. క్షమించడమంటే ఆ మనిషిని మరిచిపోయినట్లే కాదా?

క్రాలింగ్ బెల్ మోత విని తలుపు తెరిచిన స్వరాజ్యానికి - వాకిట్లో రిక్షావాడికి డబ్బులిస్తూ కవిపించిన వాగ్దేవిని చూస్తూనే ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"ఏవిఁటే ఈ రావడం? ఉత్తరం పత్తరం లేకుండా?" అన్నది ఆశ్చర్యం, మందలింపు మిళాయించి.

"నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామనిలే! నన్ను లోపలికి రానిస్తావా ముందు?" అని నవ్వుతూ సూట్ కేసుతో లోపలికి నడిచింది.

స్నేహితురాలికి గదిని చూపి కాఫీ ప్రయత్నంలో పడింది స్వరాజ్యం. ఎండలో పడి వచ్చిందేమో- చల్లని నీళ్ళతో ముఖాన్ని కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ - వంట గదిలో స్వరాజ్యాని కెదురుగా పీట వేసుకుని కూర్చుంది వాగ్దేవి.

# రచయిత మనిషే

## గొల్లపూడి రాజ్యలక్ష్మి

"ఏవిఁటలా ఒక్కదానివీ వూడిపడ్డావ్? విరించి రాలేదేం? పిల్లలు బావున్నారా?"

"పిల్లలు బావున్నారు. విరించి రాలేదు- సెలవు దొరక్కపోవడంవల్ల.... ఏం నేను ఒక్కదాన్నీ రాలేనని నీ ఉద్దేశ్యమా?"

"అప్పుడే నామీద దండయాత్ర చేయకు తల్లీ! ఎప్పుడూ నువ్వు ఒంటరిగా ప్రయాణం చేయలేదు కదా? అందుకని అడిగాను!"

"నిజమేనోయ్! కాని ఆ రోజులు వేరు. ఇప్పుడు నాకోసం ఎవర్నీ ఇబ్బందిపెట్ట దల్చుకోలేదు. విరించికి వీలు దొరకనప్పుడు నా సంగతి నేనే చూసుకోవటం మంచిది కదా! అవునూ.... విజయవాడలో మన విమ్మీ మేరేజ్ కదా నిన్న! నువ్వూ వస్తావనుకొన్నాను. రాలేదేం?"

"కుదరలేదు."

"అదే ఎందుకు కుదరలేదు?"

"నిన్న బాబ్జీకి వంట్లో బావుండలేదు. ఎలా రాను?"

"రమేష్‌ని లీవు పెట్టి చూసుకొమ్మని నువ్వు రావలిసింది!"

వాగ్దేవి కళ్ళల్లోకి చూసి చిన్నగా నవ్వింది స్వరాజ్యం.

"ఏవిఁటా నవ్వు?" అన్నది కాస్త చిరాకుపడుతూ.

"నవ్వకేం చేయను? నేనట్లా రాలేనని నీకు తెలుసుకదా! ముందీ కాఫీ తాగు. ఆ చిరాకు తగ్గుతుంది." వాగ్దేవికి కప్పు అందించి తనూ తీసుకుని ఆమె కెదురుగా కూర్చుంది.

"నువ్విట్లా ఏదో ఒకటి సాకు చెప్తావని నాకు తెలుసు. సరే.... ఎలాగూ విజయవాడదాకా వచ్చాను కదా! బందరువస్తే నిన్ను చూసినట్లూ వుంటుంది. వూరునూ చూదామనిపించింది."

"ఊరుని చూసేదేముంది? ఇదేం మీ హైద్రాబాదా? అయినా ఇక్కడే పుట్టి పెరిగిన నీకు ఈ వూరేం కొత్తకాదు కదా?"

"అదేనోయ్! పెళ్ళయి వెళ్ళిన తర్వాత ఎప్పుడొచ్చా నీవూరు? దాదాపు పది ఏళ్ళు అయింది. అమ్మ, అన్నయ్య కూడా హైద్రాబాద్‌కే మకాం మార్చేశారు కదా! ఇంక ఈ వూరు వచ్చే అవసరం కన్పించలేదు. ఈ పదేళ్ళలో ఈ వూరి మునిసిపాలిటీ వాళ్ళు ఏఏ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారో చూదొద్దా మరి?"

"చూడు. చూడు. కావాల్సినన్ని మురిక్కాలవలు, దోమలు, పందులు.... చాలా అభివృద్ధి చెందాయి మరి!" అంటూ గలగలా నవ్వింది స్వరాజ్యం. ఆ తర్వాత స్నేహితురాళ్ళిద్దరూ తమ కాలేజీ జీవితం, అప్పటి స్నేహితులు యిప్పుడెక్కడున్నారో గుర్తు చేసుకుంటూ రమేష్ ఆఫీసునుంచి, బాబ్జీ స్కూలునుంచి వచ్చేదాకా చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

## 2

మర్నాడు వుదయం రమేష్, బాబ్జీలు వెళ్ళాక స్వరాజ్యాన్ని తీసుకుని వూళ్ళోకి బైల్దేరింది వాగ్దేవి.

రిక్షా యెక్కి గొడుగుపేట పోనీయమన్నారు.

దారి పొడుగూతా పరిశీలిస్తూ కూర్చున్న వాగ్దేవి "ఊరేం మారలేదోయ్! అవే యిళ్ళు. అవే గుంటల రోడ్లు. పదేళ్ళనాడు నేను చూసినట్లే వుంది...." అన్నది.

"ఇంకో పదేళ్ళయినా ఇట్లాగే వుంటాయివి—నువ్వేం బెంగెట్టుకోకు!" అన్నది స్వరాజ్యం.

రిక్షా దిగి ఆ ఇంటివైపు వెళుతున్న వాగ్దేవికి చిత్రమైన అనుభూతి కలుగసాగింది. వాకిలిముందు కొబ్బరిచెట్లుఅట్లాగేఉన్నాయి. ఆ ఇంటి గోడలు పాతబడి వున్నా, ఎంతో సన్నిహితుల్ని చూసినట్లు మనసు స్పందించింది.

'ఈ ఇంట్లో తాము దాదాపు 15 ఏళ్ళు వున్నారు. తన బాల్యం, చదువు, పెళ్ళి ఇక్కడే జరిగినాయి. ఈ ఇంట్లోని ప్రతి అణువుతో తనకెంతో పరిచయం, అనుబంధం వున్నాయి.' అనుకుంది.

తలుపు తీసుకుని లోపలికెళ్ళారు. వీళ్ళను చూస్తూనే ఇల్లుగలావిడ శారదమ్మ ఆప్యాయంగా ఆహ్వానించింది.

"ఎప్పుడొచ్చావ్ దేవీ! ఇన్నాళ్ళకు.... ఇన్నేళ్ళకు మేము గుర్తొచ్చామా!" అన్నది నవ్వుతూ.

"గుర్తున్నారు కాబట్టే....వచ్చానుపిన్నీ. మిమ్మల్నీ-- ఈ ఇంటినీ ఎట్లా మర్చిపోగలను?" అన్నది వాగ్దేవి.



వాగ్దేవి తల్లిని గురించీ. అన్నగారి ఉద్యోగం వివరాలూ. వాగ్దేవి కుటుంబం గురించీ వివరాలడిగి తెలుసుకుంది శారదమ్మ.

"మేమున్నవాటాలోఎవరున్నారిప్పుడు?" అడిగింది వగ్దేవి.

చెప్పిందామె. "ఆ వాటాలో కెళదాంరా!" అంటూ తీసికెళ్ళింది. చాలా థ్రిల్లింగ్‌గా అన్పించింది వాగ్దేవికి.

'కొన్నేళ్ళక్రితం ఈ ఇల్లు తమది. ఈ గోడలు....నేల....కప్పు అంతా....ఆ కిటికీ చువ్వలల్లోంచి ఆకాశాన్ని చూస్తూ ఎన్నో సార్లు గడిపింది. ఆ షెల్ఫ్‌లోనే తన పుస్తకాలు, అలంకరణ వస్తువులు వుంచేది. ఈ గదిలోనే తన చదువు. ఫ్రెండ్స్‌తో అనేక విషయాలు చర్చించుకోడం....' తల్లి వొడిలోకి చేరినంత సుఖంగా అన్పించింది వాగ్దేవికి. పెరట్లోకి వెళ్ళి మొక్కల్ని చూసింది.తను నాటిన మామిడిఅంటు చాలా పెద్దదయింది. ఆయిదేళ్ళనుంచీ కాపు కాస్తోందని చెప్పింది శారదమ్మ. ఆ మొక్కని పరిశీలిస్తూ సాలోచనగా తల పైకెత్తిన వాగ్దేవికి మేడమీదిగది కన్పించింది. ఆ గదిని చూడగానే ఎన్నో విషయాలు గుర్తుకొచ్చాయామెకు.

•తను కాలేజీలో చదుపుకొనే రోజుల్లో ఆ మేడమీది గదిలో ఓ కుర్ర రచయిత వుండేవాడు. అతని పేరు.... ఆవును! మూర్తి. సన్నగా. పొడుగ్గా- చామనచాయ రంగులో.... చాలా బిడియస్తుడు. ఎవరైనా పలకరించినప్పుడు తడబడుతూ— చాలా తమాషాగా మాట్లాడుతాడు. అప్పట్లో అతని రచనలమీద ఎంతో క్రేజ్ పెంచుకుంది తను. నిజానికి ఆ వయసే అట్లాంటిది! ఆరోజుల్లో అతను ఎక్కువగా ప్రేమ కథలు-సాంఘిక దురన్యాయాల్ని విమర్శిస్తూ ఆదర్శవంతమైన జీవితం ఎట్లా గడపాలో వర్ణిస్తూ— చాలా హృద్యంగా రచనలు చేసే వాడు. ముఖ్యంగా అతని శైలి తనకెంతో నచ్చేది. ఒక రచయిత తమ ఇంటి పై భాగాన వుండటం వల్ల — ఆతనెంతో తమకు దగ్గరయినట్లు గర్వంగానువుండేది.•

"ఏమిటా ఆలోచన?" అన్నది స్వరాజ్యం ఆమెను కుదుపుతూ.

"ఏం లేదు-నీకు మూర్తి గుర్తున్నాడా?"

"ఏ మూర్తి? మూర్తిశ్రీ అన్న పేరుతో కథలు రాస్తాడు అతనా!"

"ఔను. ఈ మేడపై వుండేవాడు అప్పట్లో...."

"గుర్తు లేకేం! అతని కథలంటే పడి చచ్చేదానివి కదూ?"

"ఆ రోజుల్లో చాలా మంచి రచనలే చేసే

# శారద రాత్రులు

ఉరిమి గుండెలు వ్రీల్చెనో — మెరపు లమిని
కనులు మిరుమిట్లు గొలిపెనో — కార్ముకమ్ము
సారె వర్షించెనో — గర్వసారముడిగి
తెల్లబడిపోయి మబ్బులు తేలిపోయె.

ఎండిపోయిన వెన్నెల వెండితీగ
లవిరళా సారధారల నాకు దొడిగి
పూచెనో యేమొ పాండురుక్ పూరపూర్ణ
మౌచు తళతళలాడె నిశావయమ్ము.

చారుతరమైన శ్రీ శరత్సమయమంట!
విజయదశమీ మహోత్సవ వేళయంట!
పండు వెన్నెలలంట! భూఖండమందు
నింక నానంద సంపద కేమికొదవ?

రేయిరేయెల్ల కౌముదీచ్ఛాయలందు
దిగ్విదిక్కులు కూడ ప్రతిధ్వనింప
పాడుకొందును గొంతెత్తి భావగీతు
లేల విశ్రాంతి? ఎద్దురయేల నాకు?



— శనగన నరసింహస్వామి

వాడు. ఇటీవల అతని పేరు కన్పించటం లేదు."

"ఆఁ....ఇంకా ఏం రాస్తాడు! పెళ్ళాం.. పిల్లలు....సంసార జంఝాటం...." శారదమ్మ నవ్వి అన్నది, "అతగాడు యింకా ఈ వూళ్ళోనే వుంటున్నాడు."

"అట్లాగా!"

'అతని భార్య యెట్లా వుంటుంది? బాగా చదువుకున్నదేనా? అతని రచనా వ్యాసంగానికి తోడు. నీడగా వుంటుందా? కథల్లో లాగానే అతను భారతో సరదాగా మాట్లాడుతాడా?' వగైరాలు అడగాలని పించినా పెద్దావిడ ముందు అట్లా కుతూహలం ప్రదర్శించటం మంచిది కాదని వూరుకుంది వాగ్దేవి.

"ఎక్కడుంటున్నారు?" అనడిగింది స్వరాజ్యం.

"ఈ వీధిలోనే ఎడంవైపు నాలుగో ఇల్లు. అతగాడి పెళ్ళాం మాకు దూరపు చుట్టమే!" అన్నది శారదమ్మ.

మరో అరగంటసేపు అక్కడే గడిపి- ఆవిడిచ్చిన కాఫీ తాగి బయటపడ్డారిద్దరూ. నాలుగు అడుగులు వేశాక మూర్తి ఇల్లు గుర్తుపట్టారిద్దరూ. వాగ్దేవి ఏదో ఆలోచనగా ఆగిపోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? వాళ్ళింటి కెళ్దామనా?" అన్నది స్వరాజ్యం.

'రచయితల్ని కలుసుకోవడం— వాళ్ళతో కాసేపు నేటి సాహిత్యపు రీతుల్ని గురించి చర్చించుకోవడం తనకేం కొత్త కాదు. హైద్రాబాద్‌లో వుండటం నుంచి ప్రముఖ రచయితల్నే కలుసుకోగల్గింది. కాని....ఒకప్పుడు తను మూగగా అభిమానించిన రచయితను-అనుకోకుండా ఇన్నేళ్ళ తర్వాత.. తన్నుచూసి గుర్తుపడతాడా? చూద్దాం!' అని ఉత్సాహపడి "పద! ఆయన్ని కలుసుకుని కొంచెంసేపు మాట్లాడి వద్దాం!" అన్నది స్వరాజ్యంతో.

స్వరాజ్యం కాస్త సంకోచంతో— "అతను.... ఇంట్లో వున్నాడో— లేదో! ఆఫీసు టైం కదా!" అన్నది.

"అతని భార్య వుంటుందికదా! రచయిత భార్యగా ఆమె అనుభవాలేమిటో ఇంటర్వ్యూ చేద్దాం."

వాగ్దేవి ఉత్సాహాన్ని గమనించి వూరుకొంది స్వరాజ్యం.

గేటు తీసుకొని లోపలి కొస్తున్న వీళ్ళద్దర్నీ చూసి,

"ఇదిగో....నీ కోసం యెవరో వచ్చారు చూడు!" అని భార్యని కేకేశాడు మూర్తి.

"నమస్తే! మేం వచ్చింది మీకోసమే సార్! ఆవిడని అనవసరంగా కంగారు పెట్టకండి!" అన్నది వాగ్దేవి.

ఆమెవంక కాస్త ఆశ్చర్యంగా చూసి "కూర్చోండి!" అన్నాడు కుర్చీలు చూపిస్తూ.

ఇద్దరూ ఆసీనులయ్యారు.

మూర్తిని పరిశీలనగా చూసింది వాగ్దేవి. నుదురు మరింత విశాలమై బట్టతలను సూచిస్తోంది. కాస్త వొళ్ళు వచ్చింది. పొట్ట కూడా వున్నానంటోంది.

'ఇతన్ని చూసేనా—ఆ రోజుల్లో పలకరించడానికి బిడియంగా వుండేది? తనకంటె ఎన్నో రెట్లు ఎత్తు వున్నట్టు, మేరు శిఖరాన్ని చూసినట్లు ఏదో తొట్రుపాటుగా అన్పించేది.

ఇప్పుడితన్ని చూస్తే ఎట్లాంటి సంకోచాలూ కలుగటంలేదేం? అతి సాధారణమైన మనిషిలా అన్పిస్తున్నాడేం? అప్పటికంటే తను ఎదగటంవల్లనా....? అతను రచయితగా వెనుకబడటం వల్లనా?, "మీరు?" అన్నాడు సందేహిస్తున్నట్లు.

"నన్ను గుర్తుపట్టలేదనుకుంటాను? దాదాపు పదేళ్ళ క్రిందట శారదమ్మగారింట్లో వుండేవాళ్ళం! మీరప్పుడు పై భాగంలో వుండేవాళ్ళు."

"ఓ మీరు వాగ్దేవి కదూ?" అన్నాడు కాస్త ఉత్సాహంగా.

"అంతేకాదు. మీ అభిమానిని కూడా! ఈమె నా స్నేహితురాలు స్వరాజ్యం" పరిచయం చేసింది.

"మిమ్మల్ని నేను...నిజంగానే గుర్తుపట్టలేదు. మీరు చాలా మారిపోయారు" అన్నాడు నవ్వుతూ.

'నిజమే! అప్పటికంటె కాస్త ఒళ్ళు వచ్చింది. వేషభాషల్లోనూ మార్పు వచ్చింది. ఆ రోజుల్లో వాగ్దేవికి అలంకరణపట్ల విపరీతమైన మోజు వుండేది....ఇప్పుడామెలో ఆ చిహ్నలే లేవు. ఒక్క బొట్టు మినహాయించి మరే ఇతర అలంకారాలూ లేవు. ఆభరణాలన్నీ విసర్జించి— చిన్న- చిన్న పూలున్న తెల్లని ఫుల్‌వాయిల్ చీర, జాకెట్టుతో అతి నిరాడంబరంగా వుంది!' అనుకుంది స్వరాజ్యం.

"మార్పు సహజం కదండీ! నిజానికి మార్పులేని జీవితం ఎంతో బోర్ కొడుతుంది." అన్నది వాగ్దేవి తను కూడా నవ్వుతూ.

"ఒక పద్ధతికి అలవాటుపడిన జీవితానికి మార్పు అంత ఉత్సాహకరంగా వుండ

దండీ" అన్నాడతను.

"అట్లాంటి వాళ్ళను అభివృద్ధి నిరోధకులనవచ్చనుకుంటాను. తాము న్న పరిధి లోంచి బైటపడకుండా అదే ప్రపంచం అనుకోవడం ఆత్మవంచకులు చేసే పని!"

మూర్తి ముఖం కాస్త వెలుగు తగ్గింది. మౌనంగా వూరుకున్నాడతను.

"ఈ మధ్య మీరేం రాయడంలేదా?" అన్నది ప్రసంగాన్ని మారుస్తూ స్వరాజ్యం.

"ఏదో అప్పుడప్పుడు .... రాయాలని అనిపించినప్పుడు .... ఆఫీసు పని వొత్తిడి యింట్లో పిల్లలు....రోగాలు....ఏదో ఒక ఆటంకం! అంత విరివిగా రాయలేక పోతున్నాను!"

"ఇంట్లో వుంటారో లేదో అనుకుంటూ వచ్చాం. ఈ రోజు ఆఫీసు లేదా మీకు!"

"శ్రీమతి ఇంట్లో లేదండీ .... సెలవు పెట్టానివాళ!"

"వూరికెళ్ళారా? అన్నట్టు మీరింతకు ముందు ఆమెను కేకేశారు?"

"అంటే....ఇంట్లో లేదంటే....బయట వుందనే అర్థంతో అన్నానా మాట!" అన్నాడు కాస్త ఇబ్బందిగా చూస్తూ.

వాగ్దేవి వెంటనే ఏదో అనబోయి వూరుకుంది.

"మీ చిరంజీవులు.... ఏం చదువుతున్నారు?" స్వరాజ్యం.

"నాకు మూడు ప్లసీలు – రెండు మైనస్‌లు" అని నవ్వి–పెద్దవాడు సెవంత్.. రెండోవాడు ఫిఫ్త్. మూడోవాడు ఫోర్త్. అమ్మాయి సెకండ్.... లాస్ట్ బేబీ అప్పర్ కె. జి." అన్నాడు సగర్వంగా.

"అంటే మీకు కుటుంబ నియంత్రణ మీద నమ్మకం లేదా?"

"లేకేం. అందుకే అంతటితో ఫుల్‌స్టాప్ పెట్టాను."

'లేకుంటే ఇంకా ఎంతమందిని కనేవాడో, మహానుభావుడు!' అనుకుంది స్వరాజ్యం.

"నాకో సందేహం. మీరు రచయితలు-అభ్యుదయవాదులు కదా! ప్లస్‌లు, మైనస్‌లు అంటూ ఉదహరించడం ఆశ్చర్యంగా వుందండీ!" అన్నది వాగ్దేవి.

"ఎంత రచయితలమైనా, నిలబడాల్సింది నేలపైనే కదండీ! ప్రస్తుత పరిస్థితులు నేను ఉదహరించిన దానికి భిన్నంగా లేవు. ఇక ముందు వుంటాయన్న ఆశా లేదు."

"ఎట్లా చెప్పగలరు? ఏ వ్యక్తి అయినా తన వంతు ప్రయత్నం చేయాలి కదా! కనీసం మన భావాల్లోనయినా విప్లవకరమైన, ఆరోగ్యవంతమైన ఆలోచనలు కోరుకోవాలి. సాధ్యమైనంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి. అంతేగాని, 'ఎదుటివారికొరకే నీతులు' అన్నట్లు వుంటే ఎట్లాగ?"

"మీరు చాలా ఆవేశంగా మాట్లాడుతున్నారు. రచయితగా నాకూ ఇట్లాంటివి ఇష్టం లేదు. నన్ను మరీ అంత ఛాందసుడిగా జమకట్టకండీ!" అన్నాడు కాస్త చిన్నబుచ్చుకుంటున్నట్లుగా.

"మీ ఆవిడని పరిచయం చెయ్యరూ?" అన్నది స్వరాజ్యం.

"తప్పకుండా...." అంటూ ఆ గది నానుకుని ప్రక్కగా వున్న వరండాలోకి వెళ్ళాడు.

"ఇదిగో....నువ్వొకసారి యిటురా!" మూర్తి.

"ఎందుకు?"

"వాళ్ళు నిన్ను పరిచయం చేయమంటున్నారు."

"ఇలా ఎట్లా రాను?"

"ఫర్వాలేదు....పది నిమిషాలు కూర్చుని వచ్చేద్దువుగాని!"

"ఇంతకూ....వాళ్ళెవరండీ?"

"చెప్తాగా .... రా!"

చాలా మెల్లిగా అయినా వాళ్ళ మాటలు వినిపించాయి ఇద్దరికీ. మూర్తి, అతని వెనుక భార్యా వచ్చారు.

ఆవిడవంక ఆసక్తిగా చూశారు- వాగ్దేవి, స్వరాజ్యం.

తెల్లగా, బొద్దుగా, పొట్టిగా దాదాపు 30 ఏళ్ళపైన వయసుంటుంది. కాస్త నలిగిన చీరా, వేలుముడీ, ముఖంలో అమాయకత్వం.

"ఈమె నా భార్య పార్వతి" అన్నాడు పరిచయం చేస్తూ.

"వీళ్ళు నా అభిమానులు, ఆమె హైద్రాబాద్ నుంచి వచ్చారు" అని క్లుప్తంగా వాగ్దేవిని, స్వరాజ్యాన్ని భార్యకు పరిచయం చేశాడు. నమస్కారాలయ్యాయి

పార్వతి అక్కడున్న గాద్రెజ్ ఛైర్‌ని కాస్త దూరంగా లాక్కుని కూర్చుంది.

"మీరు.... మీ వారి కథలు చదివారనుకుంటాను!" అడిగింది వాగ్దేవి. తల వూగించింది– చదివానన్నట్లుగా

"ఆయన రచనా వ్యాసంగానికి - మీరేమన్నా సహాయం చేస్తారా? అంటే విమర్శలు.... సూచనలు లాంటివి ఇవ్వడం.... వగైరా?"

పార్వతి వాగ్దేవి వైపుచూసి – మూర్తి ముఖం వైపు చూసింది


"సహాయం అంటే ఆమెకు చేతనయినంతవరకు చేస్తూనే వుంటుందనుకోండి.... మా ఆవిడ రైటింగ్ చాలా బాగుంటుంది.. అందుకే కథలు ఆమెచేతనే ఫెయిర్ చేయిస్తాను. అయితే విమర్శలు....సూచనలు.... ఇలాంటి గొడవలు ఆమెకు తెలియవు. తను ఒక మంచి గృహిణి అనుకోండి!" అన్నాడు మూర్తి.

"నాకు ఇంట్లోపనే సరిపోతుందండీ.... రెస్టు అంటూ దొరికేది ఇట్లాంటి సమయంలోనే...." అన్నది పార్వతి- తను ఏదో ఒకటి మాట్లాడకపోతే బాగుండదేమో.... అని.

"అంటే మీరు మీ భార్యకు సహాయం ఏం చేయరా? ఐమీన్.... వంటపనిలో.... పిల్లలపనిలో.... మీ కథలలోని ఆదర్శమైన భర్తలాగా అన్నమాట!" అన్నది నవ్వుతూ హాస్యంగా.

మూర్తి కాస్త ఇబ్బందిగా చూసి "అవి కథలు.... ఇది జీవితం! కథల్లోలా బతకాలనుకుంటే ఎట్లాగండీ?" అన్నాడు.

"కథలు జీవితాల్లోంచే గదండీ వచ్చేది! ఉదాహరణకు మీరు మీ భార్యను 'ఇదిగో'



అని పిలిచారు కదా .... అది ఎంత బాధ స్తంగా వుందో ఎప్పుడైనా ఆలోచించారా ? మీ కథల్లో పెళ్ళాల్ని 'అమ్మడూ', 'చిన్నీ' వగైరాలతో ముద్దుగా సంబోధిస్తారు కదా! అట్లా కాకపోయినా పేరుతో పిలిస్తే నష్టం ఏమిటి ?"

"ఆయు క్షీణం అంటారండీ - భార్యను పేరుతో పిలిస్తే!.... అయినా మీరు నామీద ధ్వజమెత్తటానికి రాలేదుకదా ?" అన్నాడు నవ్వు తెచ్చుకుంటూ.

"సారీ.... నా మాటల్తో మిమ్మల్ని నొప్పించానేమో.... మీ రచనలమీద వున్న అభిమానం నన్ను నోరుమూసుకో నివ్వటం లేదండీ !" అన్నది వాగ్దేవి.

"నా కిట్లా వున్నదున్నట్లు మాట్లాడే వారంటే చాలా యిష్టం !" అన్నాడు లోపల మండిపోతున్నా.

"మీరు పార్వతిగార్ని ప్రేమించి చేసుకున్నారా ?"

"పెళ్ళికి ముందు మా యిద్దరికీ ఏ మాత్రం పరిచయం లేదు. మాది పెద్దలు కుదిర్చిన పెళ్ళి!" కాస్త సిగ్గుతో అన్నది పార్వతి.

"అలాగా. కట్నం లేకుండా చేసుకున్నారు కదూ ?"

"మనలో పెద్దగా కట్నాలేముంటాయండీ?" అన్నాడు మూర్తి.

"తనకు పదివేలిచ్చారు. ఏం తక్కువ చేయలేదండీ మావాళ్ళు!" నవ్వుతూనే అంది కాస్త రోషంగా.

"మీరు.... కట్నం తీసుకున్నారా? నమ్మలేను! 65లో అనుకుంటాను 'ఎండమావులు' అన్న కథలో కట్నపిశాచిని గర్హిస్తూ సంచలనాత్మకంగా రచన చేశారు ఆ కథ చదివిన తర్వాత.... నేను కట్నం కోరినవాడిని - వివాహం చేసుకోకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను కూడా! నేనే కాదు.... నాలా చాలామంది ప్రభావితులయి వుంటారు. అంత చక్కని విప్లవ భావాలు వెలిబుచ్చిన మీరు....? పార్వతిగారు జోక్ చేయడం లేదు కదా?" అన్నది వాగ్దేవి ఆశ్చర్యంగా చూస్తూ.

వాగ్దేవి మాటలు మూర్తిని ఇరకాటంలో పడేశాయి. కుర్చీలో ముళ్ళున్నట్లు చాలా ఇబ్బందిగా అటూ - ఇటూ కదులుతూ - పార్వతి వైపు నిందాగర్భంగా చూశాడు.

"ఒక్క నిమిషం.... మీరు మాట్లాడుకుంటూవుండండి! మీరు మా అతిథులు కదా! కాస్త కాఫీ పట్టుకొస్తాను...." అంటూ మాట తప్పించి. వంటగదిలోకి పోబోయాడు.

"ఇప్పుడా మర్యాదలేం వద్దండీ! ఇందాకే శారదమ్మగారింట్లో తాగి వచ్చాము. పది నిముషాలాగి వెళ్ళిపోతాము!"

"ఫర్వాలేదు. కాఫీకేముంది ? ఎన్నిసార్లయినా తాగొచ్చు!" మూర్తి వెళ్ళాడు.

పార్వతి వాగ్దేవివైపు చూస్తూ "మీరెక్కడయినా వర్క్ చేస్తున్నారా?" అనడిగింది.

తన గురించి చెప్పింది వాగ్దేవి.

"మీరీ కాలంలోకూడా ఇట్లాంటివి పాటిస్తున్నారేమిటి ? ఈ 'దూరంగా' కూర్చోవమన్నది ఒక మూఢాచారమేగాని. అత్యవసరం కాదుగదా ? దీన్ని మూర్తిగారు వ్యతిరేకించరా ?" అన్నది పార్వతి నుద్దేశించి.

"మా వారికి మడి. ఆచారం యెక్కువండీ! రోజూ పూజా అదీ చేస్తారు. ఇంట్లో దేవుడు. నైవేద్యం వున్నప్పుడు ఇల్లాంటివి ఎట్లా కలుపుకుంటాం చెప్పండి? ఇట్లాంటి విషయాల్లో తనకు పట్టింపు చాలా వుంది!"

వాగ్దేవిదృష్టిలో మూర్తి-వామనమూర్తిలా కుంచించుకుపోతున్నాడు.

"సినిమాలేం చూశారండీ ?" అన్నది టాపిక్ మారుస్తూ స్వరాజ్యం.

"మొన్ననే నేనూ, శారదత్తయ్యా "పాండవ వనవాసం"కి వెళ్ళొచ్చాం."

"అదేం? మీరూ, మూర్తిగారూ కలిసి వెళ్ళరా?"

"ఆయనకి తెలుగు సినిమాలంటే తలనొప్పి. ఎక్కువగా ఫ్రెండ్స్‌తో కలిసి ఇంగ్లీషు పిక్చర్స్ చూస్తారు. నాకా ఇంగ్లీషువి అర్థం కావు. అందుకే మేమిద్దరం కలిసి సాధారణంగా వెళ్ళం. అసలు నాకు ఇంట్లో పిల్లల పనులతోనే సరిపోతుందండీ. వీళ్ళను సవరించుకొని వెళ్ళటం ఒక యజ్ఞం అనుకోండి. మా పెద్దాడు మహా కోపిష్టి. చీటికి మాటికి అలుగుతాడు. మా చంటిది వుందే చాలా చిలిపి" ఆమె చాలా ఉత్సాహంగా తన పిల్లల గుణగణాలు వర్ణించ సాగింది. వాగ్దేవి వినడం మానేసి గోడలపై వున్న కేలండర్లని పరిశీలించ సాగింది.

'ఈ మూర్తి రాడేం! ఎంతసేపు ఆ కాఫీ చేయటం!' అనుకుంటూ స్వరాజ్యం - పార్వతిని నిరుత్సాహపరచలేక- శ్రద్ధగా వినసాగింది.

"...అన్నమాట!మామూడో వాడొకసారి ఏం చేశాడో తెలుసా? ఆ రోజున భోరున వర్షం. నన్ను పడవల్ని చేసివ్వమని ఒకటే గోల. కాగితాలు తీసుకురారా చేస్తాను. నా పని ధ్యాసలో - అవేమిటో చూడనే లేదు. తర్వాత ఈయనగారు అబ్బో.... దిబ్బో.... పాపం దీపావళి కథల పోటీకోసం రాశారవి. ఆ రోజుతోనే లాస్ట్ డేటు! ఇంక ఆయనగారి కథాకళి చూడాలి...." పకపకా నవ్వింది పార్వతి. స్వరాజ్యం కూడా శృతి కలుపుతూ-"చాలా చిలిపి పిల్లలన్నమాట!" అన్నది.


"మావాళ్ళు అల్లరిచేసినా చదువులు అశ్రద్ధ చేయరు. మొన్న హాఫ్ ఇయర్లీలో మా పెద్దాడికి...."

వాగ్దేవి వాచీ చూసుకుంది.

మూర్తి కాఫీ కప్పులతో వచ్చాడు మరో పది యుగాలకి.

"సారీ....లేటయ్యానేమో ? అలవాటు లేని పనికదా !" అన్నాడు ఇద్దరికీ చెరో కప్పు అందిస్తూ.

పార్వతి దగ్గరకూడా ఓ కప్పు వుంచి— "కాఫీ తాగేసి నువ్వెళ్ళి రెస్ట్ తీసుకో— ఎక్కువగా మాట్లాడితే తలనొప్పి వస్తుందంటావుకదా ?" అన్నాడు. వాగ్దేవి— స్వరాజ్యం ఒకరి ముఖాలొకరు చూసు



కున్నారు.

"కాఫీ చాలా బావుందండి! థాంక్స్. మిమ్మల్ని శ్రమపెట్టాం!" స్వరాజ్యం.

"పార్వతిగారూ.... మూర్తిగారు వంట కూడా బాగా చేస్తారనుకుంటాను?" అన్నది వాగ్దేవి.

పార్వతి ఏదోఅనబోయి మూర్తి ముఖం లోకి చూసి నవ్వి వూరుకుంది.

"మూర్తిగారూ ....ఇంకో ప్రశ్న! మీ ఆవిడిన్ని ఇట్లాగా దూరంగా వుంచి, ఈ ఆచారాల్ని పాటించడం ఏమన్నా భావ్యంగా వుందా ? ఇందాక పార్వతిగార్ని అడిగాననుకోండి! మీ నుంచి కూడా దీనికి సమాధానం వినాలని వుంది" అడిగింది వాగ్దేవి.

"మేముంటున్నది బందరండీ....ఇష్టం లేకపోయినా కొన్ని పాటించక తప్పదు. ఇక్కడ మా బంధువులు చాలామంది వున్నారు. మా ఇంట్లో ఏ చిన్న మార్పు జరిగినా అందరికీ తెలిసిపోతుంది. వాళ్ళను ఎదుర్కోవాలంటే చాలాకష్టం. చెప్పాను కదండీ .... కొన్ని యిష్టం లేకపోయినా చుట్టూవున్న పరిస్థితులకు తల వొగ్గక తప్పదని....అదలా వుంచండి.... మిమ్మల్నొక ప్రశ్న యిందాకటినుంచీ అడగాలనుకుంటున్నాను. ఏమీ అనుకోరు కదా ?" అడిగాడు సీరియస్‌గా.

"ఫర్వాలేదు....అడగండి!"

"ఆదర్శాలు అంటూ ఏవో చాలా ఏకరువు పెట్టారు. మీ జీవితంలో అవి ఏమాత్రం ఆచరణలో పెట్టారు?"

"నా మనసుకి మంచివి అన్పించినవన్నీ ఆచరించాను. ముఖ్యంగా మీ ఇంట్లో అలవాట్లన్నింటికీ భిన్నంగా. అర్థమైందనుకుంటాను?"

"మీ....వారు?"

"బ్యాంక్‌లో పని చేస్తున్నారు."

"సారీ మిమ్మల్ని చూసి ఏదో అనుకున్నాను—మెడ, చేతులు ఖాళీగా వుంటే."

"నాకు ఆభరణాలంటే అసహ్యం. అవి వేసుకున్న వాళ్ళను చూస్తే జాలి."

"ఎందుకని?" భార్య మెడలోని చంద్రహారాన్ని — చేతులకున్న నాలుగు జతల గాజుల్ని ఓరకంట చూసి — కాస్త తెల్లబోతూ

"పూర్వం మనిషి బానిసగా వున్నప్పుడు మెడకి — చేతులకి "సంకెళ్ళు" వేసేవారు. వాటి గుర్తులే ఇవి. పూర్వాపరాలు తెలిసీ ఇంకా వాటినే పట్టుకుని వేలాడడం బుద్ధిహీనత. మేం ఇంకా బానిసల స్థాయిలోనే వున్నాం....అట్లా వుండడమే మాకు ఇష్టం. అన్నట్లు కోరి నగల్ని దిగేసుకోవడం బానిస లక్షణం...." అన్నది ఆవేశంగా వాగ్దేవి.

పార్వతి తెల్లబోయి— వింతగా వింటోంది.

మూర్తి ముఖం ఎన్నె తగ్గింది.

"కాని.... అవి.... సుమంగళి చిహ్నాలని మీ ఆడవాళ్ళే పాకులాడుతారు. మీరిట్లా మాట్లాడటం తమాషాగా వుంది."

"తమాషా ఏముందండి? మీరు రచయితలయి వుండీ ఇట్లాంటి భావాల్ని వదలకపోవటమే వింత. సుమంగళి చిహ్నాలని మీ మగవాళ్ళే వాటికి అందమైన ముసుగు వేసి- ఆడవాళ్ళని మైకంలో- మోసంలో వుంచుతున్నారు. నిజానికి వాటి అర్థం ఏమిటో తాపీ ధర్మారావుగారి రచనల్ని చదవండి— తెలుస్తుంది!"

మూర్తి మాట్లాడలేదు.

వాగ్దేవి భావాలు అతన్ని ఇరకాటంలో పెట్టినట్లున్నాయి. ఇంక వీళ్ళు వదిలిపోతే చాలు అన్నట్లు కూర్చున్నాడు.

ఖాళీకప్పుకిందపెడుతూ. "ఇప్పుడొస్తున్న కథల్ని చదువుతున్నారా?" అంటూ స్వరాజ్యం ప్రశ్నించింది.

"చూస్తున్నాను....ఇప్పుడు చాలా కొత్త రచయితలు వచ్చారు" అన్నాడు ముభావంగా.

వాగ్దేవికి అతన్ని చూస్తే జాలివేసింది. ప్రశ్నలతో ఇతన్ని కాస్తఎక్కువే ఇబ్బంది పెట్టినట్లున్నాను అనుకుంది. 'అయినా తన మాటలు యింత సీరియస్‌గా తీసుకుని బాధపడుతున్నాడేమిటి? ఆ రోజుల్లో ఎంత సరదాగా, చలాకీగా వుండేవాడు! అతని ఫ్రెండ్‌తో వీధిలో నుంచుని మాట్లాడుతున్నప్పుడు తను గమనించేది. ఎంతో హాస్యంగా వుండేవా మాటలు. ఏమయిపోయిందా వుత్సాహం? ఆ సరదా, ఆశయాలు వుడుకు రక్తం చేసే మాయా జాలమేనా?'

"ఎంతమంది రచయితలు వచ్చినా క్వాలిటీ పెరగటం లేదండీ. ఆ రోజుల్లో పత్రిక, ప్రభ ఎంత యింటరెస్టింగుగా వుండేవి! వాటిల్లోని కథలూ అంత గొప్పగానూ వుండేవి. చక్కని బాపూ బొమ్మలూ, మంచి వ్యాసాలూ...." వాగ్దేవి గతంలోకి వెళ్ళింది.

మూర్తి కూడా ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా మాట్లాడాడు. అప్పట్లో పడిన సీరియల్స్ గురించీ- పత్రికల గెటప్ గురించీ కాసేపు సంభాషణ నడిచింది.

మూర్తి వాళ్ళ పనిమనిషి- అంట్లగిన్నెల కోసం కేకేయడంతో, "ఇంక వస్తామండీ! చాలా థ్యాంక్స్.మిమ్మల్ని చాలాసేపు విసిగించినట్లున్నాం" అంటూ లేచింది వాగ్దేవి.

"అబ్బే, అదేం లేదండీ. నాకూ చాలా సంతోషంగా వుంది. ఎంతో అభిమానంగా ఇల్లు తెలుసుకుని వచ్చారు. నేనే మీకు థ్యాంక్స్ చెప్పాలి" అన్నాడు మూర్తి నవ్వుతూ.


"వస్తామండీ పార్వతిగారూ!"


వాళ్ళిద్దర్నీ వీధి గుమ్మందాకా సాగనంపాడు మూర్తి.

రిక్షాలో — "మొత్తానికి అతన్ని హడలగొట్టేశావ్!" అన్నది స్వరాజ్యం.

"నిజంగా అతని అభిప్రాయాలకి చాలా అప్‌సెట్ అయ్యాను, అతనట్లా మాట్లాడుతాడని వూహించకపోవడం వల్ల! వీళ్ళు గొప్ప రచయితల్లా దేశాన్ని ఉద్ధరిస్తున్నట్లు పోజు పెట్టడం!"

"అతనెట్లా వుంటే మనకేం? పోనిద్దూ.. అందుకే సినిమా స్టార్లవీ, రచయితలవీ, వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూడకూడదు.





"దుష్ట సంహారశీలి మా దుర్గతల్లి" మారేమండ శ్రీనివాసరావు

ఇష్టమైతే వాళ్ళ రచనల్ని చదువుతాం. లేదా మానేస్తాం. దట్సాల్."

"చాల్లే నోరుముయ్-సాహిత్యం అన్నది కాలక్షేపానికేనా ? రచయితలకు నిజాయితీ అక్కర్లేదంటావా ? ఏదైనా కొత్త విషయం చెప్తున్నప్పుడు మనసా. వాచా దాన్ని నమ్మినాకనే చెప్పాలి. నమ్మినదాన్ని ఆచరణలో పెట్టాలి. ఏ ప్రయోజనమూ. ఆదర్శమూ సాధించలేని వాళ్ళు కలాల్ని ముడిచి కూర్చోవాలిగాని, పాఠకుల మనసుల్ని ఖరాబు చేయకూడదు. అట్లాంటి వాళ్ళు ద్రోహులు.... ఆత్మవంచకులు...." తీవ్రంగా అన్నది.

"నువ్వు కోపంలో చాలా మంచి విషయాలు మాట్లాడుతావు దేవీ !" అన్నది నవ్వుతూ స్వరాజ్యం.

నాలుగు నెలల తర్వాత స్వరాజ్యం దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది వాగ్దేవికి.

ఏయ్ దేవీ !

నువ్వు ఒక హీరోయిన్ అయిపోయావోయ్ ! కావాలంటే.... వీక్లీ చూడు. అందులో మూర్తిశ్రీ కథ "భద్రకాళి" పడింది. అందులో భద్రకాళి ఎవరో నీకు అర్థమైపోతుంది. పాపం మానవుడు.... ఎంత బాధపడిపోయాడో.... తన కసిఅంతా తీర్చుకున్నాడు. నిన్నొక తెంపరిగా సృష్టించి అన్ని అపలక్షణాల్నీ చేర్చి- చివరికి పిచ్చిదానివిగా తేల్చాడు. ఎంత ధైర్యం? ఆ కథ నువ్వు చదవాలనే కదూ. ప్రముఖ వార పత్రికకు పంపింది! నువ్వేం చేయలేవనేనా?

ఒక రచయితగా అభిమానించి ఇంటికెళ్ళి కొన్ని ప్రశ్నలు వేసినంత మాత్రాన యింత లోకువా ? అసలీ రచయితల్నీ గొప్పగా భావించి కలుసుకోవాలనుకోవటం ఎంత బుద్ధి పొరపాటు ! నువ్వే మనుకుంటున్నావు ? ఒక కథా వస్తువయినందుకు సంతోషిస్తున్నావా ? బాధపడుతున్నావా ? వెంటనే జవాబు రాయి.

స్వరాజ్యం.

వెంటనే జవాబు వచ్చింది స్వరాజ్యానికి.

డియర్ సరూ!

ఎంత ఆవేశంగా రాశావు ఉత్తరం ! ఆ కథ చదివాను. ఎందుకంత కలవరపడ్డావు నువ్వు ? నాపై నీకుగల అభిమానంవల్లి అట్లా ఆవేదనపడ్డావుగానీ, నాకైతే ఏమీ అన్పించలేదు. నిజం! అతని మనస్థితికి ఒక రకమైన మానసిక జాడ్యానికి గురైన అతన్ని తల్చుకుంటే చాలా జాలి వేసింది. పోనీలే పాపం అట్లా రాసుకుని తన అహాన్ని తృప్తిపరచుకున్నాడు కాబోలు. రచయితా మామూలు మనిషేనోయ్. రాగద్వేషాలు వుంటాయి. పాపం వదిలేద్దాం అతన్ని. ఏం? అతనే కాదు ఎవరైనా సరే నాపై ఎట్లాంటి రాతలు రాసినా నాకేం బాధ లేదు. ఐ డోంట్ కేర్! —నీ దేవి.



వంపనూరి యుగేంధర్‌రావ్, హన్మకొండ